క్లుప్తంగా

దక్షిణాముఖ ఆంజనేయునికి విశేష పూజలు



ఫిరంగిపురం: గ్రామంలోని వేణు గోపాలస్వామి ఆలయంలోని దక్షిణాముఖ ఆంజనేయస్వామికి ఆషాఢం బహుళ అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం భక్తులు పూజలు చేశారు. స్వామి వారికి అర్చకులు వంశీకృష్ణ పంచామృతాలతో అభిషేకాలు చేశారు. నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్ర నామ పూజలు నిర్వహించారు. భక్తుల గోత్ర నామాలతో పూజలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రతిభ చాటిన తాడేపల్లి విద్యార్థులు



తాడేపల్లిరూరల్ : సిప్ అకాడమి ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబాకస్, మెంటల్ అర్థమెటిక్ పోటీలలో తాడేపల్లి విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా సిప్ అకాడమి బ్రాంచ్ హెడ్ జాహ్నవి మాట్లాడుతూ కంకిపాడులో అయాన్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో సుమారు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొన్నారని, అందులో తాడేపల్లి సిప్ అకాడమి శాఖ నుంచి 44 మంది ప్రతిభను చాటుకున్నారని చెప్పారు. విజేతలకు సిప్ ఇండియా డైరెక్టర్ శేఖర్, రీజినల్ మేనేజర్ ప్రవీణ్, రాష్ట్ర హెడ్ ఎం. గోపాలకృష్ణ సర్టిఫికెట్లు అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, దీప్తి, సెంటర్ మేనేజర్ ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్‌కు తప్పని సరిగా రావాల్సిందే

రానివారిపై కఠిన చర్యలు తప్పవు



తాడేపల్లిరూరల్ : నార్త్ సబ్ డివిజన్ పరిధిలోని తాడేపల్లి, మంగళగిరి పట్టణ రూరల్‌లో పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు ఆదివారం ఆయా పోలీస్ స్టేషన్లలోని అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజు మాట్లాడుతూ రౌడీ షీటర్లు, సస్పెక్టెడ్ షీటర్లు ప్రతి ఆదివారం ఉదయం 9 గంటలకు పోలీస్ స్టేషన్‌కు వచ్చి హాజరు కావాలని, హాజరుకానివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మంగళగిరి పట్టణ, రూరల్ పరిధిలోను ఎస్‌ఐలు ఖాదర్ బాషా, వెంకట్ రౌడీ షీటర్లకు తమదైన శైలిలో కౌన్సెలింగ్ నిర్వహించారు.

సీతానగరంలో హృదయార్చన



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణం సీతానగరంలో ఉన్న జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం హృదయార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్ రామానుజాచార్యులు వారిని కీర్తిస్తూ సుమారు 500 మంది ఈ హృదయార్చన కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. రామానుజుల వారి సంకీర్తనలతో సనాతన ధర్మ ప్రచారాన్ని కొనసాగిస్తూ కీర్తనలు చేశారని తెలిపారు. భగవత్ రామానుజాచార్యులు చేసిన ఎన్నో సంఘ సంస్కరణలను కొనియాడుతూ ప్రపంచానికి వారి గురించి తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ హృదయార్చన కార్యక్రమాన్ని నిర్వహించారని ఆయన తెలిపారు.

కార్మెల్ మాతకు భక్తుల మొక్కులు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ కొండపై కొలువైన కార్మెల్ మాతను దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆదివారం తరలివచ్చారు. నంద్యాల, వెంకటాపురం, పాదిలి, ఆదోని ప్రాంతాల నుంచి వచ్చిన వారు.. బాల ఏసు దేవాలయం ప్రాంగణంలోని కార్మెల్ వసతి గృహం నుంచి కొండను ఎక్కి తలనీలాలు సమర్పించారు. కార్మెల్ మాతను దర్శించుకొని కొవ్వొత్తులు వెలిగించి కొబ్బరికాయలు కొట్టారు.

పరిమితి మించి..ప్రమాదం పొంచి



పరిమితికి మించి కూలీలను తీసుకెళుతున్న వాహనం



ఎక్కువ మంది విద్యార్థులను తీసుకెళుతున్న ఆటో

ఫిరంగిపుర: ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తున్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పొలం పనుల నిమిత్తం ట్రాక్టర్లు, మినీ లారీలు, ఆటోలలో కూలీలను ఎక్కువ సంఖ్యలో తరలిస్తున్నారు.

- ఫిరంగిపురం నుంచి హౌస్ గణేష్, పొనుగుపాడు, గుండాలపాడు, మునగపాడు, బేతపూడి, కండ్రిక, యర్రగుంట్ల పాడు, వేమవరం వంటి ప్రాంతాలకు బస్సు సౌకర్యం లేదు. దీంతో అక్కడి ప్రజలకు ప్రయాణానికి ప్రత్యామ్నాయంగా ఆటోలు, మినీ లారీలతో పాటు పలు వాహనాల్లో ప్రయాణించాల్సిన పరిస్థితి. దీంతో ఆయా వాహనాల్లో ఎక్కువ సంఖ్యలో ప్రయాణికులను తీసుకువెలుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునే విద్యార్థులు ఫిరంగిపురం రావాలన్నా తిరిగి వెళ్లాలన్నా ఆటోలే ప్రయాణ సాధనాలుగా ఉపయోగపడుతున్నాయి. దీంతో ఆటోల్లో లెక్కకు మించి విద్యార్థులను ఎక్కించుకొని తీసుకెళ్తున్నారు. గతంలో గుంటూరు- కర్నూలు రాష్ట్ర రహదారిపై రేపూడి గ్రామ శివారులో జరిగిన ఆటో ప్రమాదంలో పలువురు విద్యార్థులు చనిపోగా మరికొందరు క్షతగాత్రులయ్యారు. వర్షాకాలం కావడంతో రహదారిపై వాహనాలు జారిపడిపోతున్నాయి.
- పరిమితికి మించి ప్రయాణికులను వాహనాలల్లో ప్రయాణిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఆశాఖ అధికారులు స్పందించి ప్రమాదాలు సంభవించకముందే తగిన చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రచయిత, కార్టూనిస్ట్ సుభానీకి సత్కారం



కార్టూనిస్టు షేక్ సుభానిని సత్కరించిన సుజాత

తాడేపల్లిరూరల్: రచయిత, కార్టూనిస్ట్, సాహిత్య కళా పోషకుడు షేక్ సుభానీని అక్షయ సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం దుగ్గిరాలలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ అంతర్జాతీయ ఐఎస్‌ఓ గుర్తింపు పొందిన పద్మభూషణ్ గుర్రం జాషువా కళా పరిషత్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 2024 సేవారత్న పురస్కారాన్ని సుభానికి అందజేశామని అన్నారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీత షేక్ సుభాని మాట్లాడుతూ 1991లో రచయితగా తన సాహిత్య రంగ ప్రారంభం జరిగిందని, బాపట్లలో జరిగిన ఉగాది కథల పోటీల్లో తను రాసిన కథకు తృతీయ బహుమతి లభించిందన్నారు. మాజీ కేంద్ర మంత్రి, ప్రస్తుత శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా బహుమతి అందుకున్నాని తెలిపారు. 1990వ దశకంలో రచయితగా, కార్టూనిస్టుగా క్రియాశీలంగా వ్యవహరించారని, పలు ప్రముఖ వార్తాపత్రికలలో తన రచనలు, కార్టూన్‌లు బహుమతులు పొంది ప్రచురించబడ్డాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాకా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామలింగ చౌడేశ్వరి అమ్మవారి జన్మదినం



బోనాలతో గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

తాడేపల్లిరూరల్: దేవాంగ చేనేత కులదేవత శ్రీశ్రీ రామలింగ చౌడేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవాన్ని అమరావతి దేవాంగుల సంక్షేమ సంగం ఆధ్వర్యంలో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళగిరిలో కొప్పురావు కాలనీలోని సంఘ కోశాధికారి అల్లాక నమశ్శివాయ ఇంటివద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలతో కొప్పురావు కాలనీ నుంచి మొదలై మిద్దె సెంటర్, మెయిన్ బజార్, గాలిగోపురం మీదుగా పానకాల స్వామి ఘాట్ రోడ్డు, వెంకటేశ్వరస్వామి వారి గుడి మీదుగా గండాలయ పేటలోని శ్రీశ్రీశ్రీ తోతాద్రి పోలేరమ్మ ఆలయం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బల్ల వెంకట రమణ, అల్లక తాతారావు, అమరావతి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాడిశెట్టి శివశంకరరావు, గౌరవ అధ్యక్షులు మత్స్య నిరంజన్ కుమార్, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు బంగారు ఆనంద ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ది సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు రాజు



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ రాజు

తెనాలి: ఖాతాదారులకు చక్కని సేవలను అందిస్తూ సొసైటీ బ్రాంచి అభివృద్ధిలో సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని ది సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్ పీఆర్‌వీపీఎస్ రాజు అన్నారు. సొసైటీ, తెనాలి సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక ఎన్జీవో కళ్యాణమండపంలో నిర్వహించారు. అధ్యక్షత వహించిన చైర్మన్ రాజు మాట్లాడుతూ సొసైటీ కార్యకలాపాలను వివరించారు. మేనేజింగ్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ దేశంలోని అగ్రగామి 10 సొసైటీల్లో తమ సొసైటీ ముందు వరసలో ఉందని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.77 కోట్ల లాభాలను ఆర్జించినట్టు తెలిపారు. డిపాజిట్లపై 10 శాతం, సేవింగ్స్‌పై 6.5 శాతం వడ్డీని చెల్లిస్తున్నామని వివరించారు. సొసైటీ వార్షిక ప్రణాళిక, విధివిధానాలు, ఆర్థికలావాదేవీలు, లాభనష్టాలు, వృద్ధిరేటు గణాంకాలను సభ్యులకు వివరించారు. సొసైటీ 27వ సంవత్సరం పూర్తి చేసుకుని, 42 శాఖలతో నడుస్తోందని చెప్పారు. తొలుత సొసైటీ వ్యవస్థాపకుడు వాసిరెడ్డి హనుమంతరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సొసైటీ ఆర్ఎం డీవీఎస్ శంకరరావు, మేనేజర్ పి.శ్రీకాం, సిబ్బంది గణేష్, సాయి తరుణ్, బాషా, సుధాకర్ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరణ



గ్రంథాలయ అధికారిణి, పిల్లలకు పుస్తకాల వితరణ

తెనాలి: పట్టణానికి చెందిన వేజళ్ల వెంకట సుబ్బారావు విద్యా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపేటలోని మహిళా బాలల గ్రంథాలయానికి ట్రస్ట్ బాధ్యులు వేజళ్ల నవ్య పుస్తకాలను బహూకరించారు. ఈసందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ మాట్లాడుతూ, విద్యా ట్రస్టు ద్వారా ఏటా విలువైన పుస్తకాలను పాఠశాలల గ్రంథాలయాలకు, ప్రభుత్వ గ్రంథాలయాలకు బహూకరిస్తున్నామని చెప్పారు. సెల్‌ఫోన్ యుగంలో యువతరానికి పుస్తక పఠనం అలవరచేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. పుస్తక పఠనంతో భావవ్యక్తీకరణ నైపుణ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో గ్రంథాలయాలకు అత్యధిక ప్రాముఖ్యత ఉంటుందని వివరించారు. నేటితరం గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయ అధికారి శ్రీమతి కోడూరి అంజని దాతలు సమకూర్చిన పుస్తకాలు పిల్లలకు బాగా ఉపకరిస్తాయని చెబుతూ వారికి ధన్యవాదాలు తెలిపారు. తమ గ్రంథాలయంలో ప్రతి ఆదివారం పిల్లలకు 'రూమ్ టి రీడ్' నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఇద్దరికి డాక్టరేట్ల ప్రదానం



సంగీత సంఖ్యాయని



రత్నం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇద్దరికి డాక్టరేట్లు ప్రదానం చేసింది. ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ విభాగ పరిశోధకురాలు ఎ. సంగీత సంఖ్యాయనికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్‌సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. సుధాకర్ తెలిపారు. ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ పరిశోధన పర్యవేక్షకులు డాక్టర్ పి. బ్రహ్మజీరావు పర్యవేక్షణ లో 'క్యారక్టరైజేషన్ ఆఫ్ నానో కాపర్ ఆక్సైడ్ పార్టికుల్స్ ఎక్స్‌ట్రాక్ట్ ఫ్రమ్ ఈ వేస్ట్ అండ్ ఎఫిషియన్సీ అండ్ వాటర్ క్వాలిటీ క్రైటీరియా' అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినట్లు పేర్కొన్నారు. డాక్టర్ అంబేద్కర్ అధ్యయన కేంద్ర పరిశోధకుడు కె. రత్నానికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. సుధా కర్ తెలిపారు. అంబేడ్కర్ అధ్య యన కేంద్రానికి చెందిన కె. సోమశేఖర్ పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ పాలసీస్ అండ్ ప్రోగ్రామ్స్ ఆన్ లివింగ్ కండిషన్స్ ఆఫ్ అగ్రికల్చరల్ లేబర్ ఏ కేస్ స్టడీ ఇన్ గుంటూరు డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినట్లు తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తెనాలిరూరల్: ఘర్షణ పడవద్దని చెప్పిన వ్యక్తి పైనే రాయితో దాడి చేసి గాయపరిచిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణ ఇస్లాంపేటకు చెందిన తిరుపతి రావు ఆదివారం తెల్లవారుజామున తన వద్ద పని చేసే షేక్ బూరాతో కలసి మార్కెట్ యార్డుకి వెళుతున్నాడు. అక్కడ అతనికి తెలిసిన యశ్వంత్ మరొకరితో ఘర్షణ పడుతున్నాడు. తిరుపతిరావు వెళ్లి సర్దిచెప్పేందుకు ప్రయత్నించగా యశ్వంత్ రాయితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితుడు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు చుండూరు మృతవీరుల సంస్మరణ సభ

తెనాలిఅర్బన్: చుండూరు మృతవీరుల సంస్మరణ సభ ఈ నెల 6వ తేదీ నిర్వహించనున్నట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక వ్యవస్థాపకులు అక్కిదాసు కిరణ్‌కుమార్ తెలిపారు. రైల్వే స్టేషన్ రోడ్డులోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంగళవారం 'చలో చుండూరు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. చుండూరులో నిర్వహించనున్న సభకు అంబేడ్కర్‌వాదులు, ప్రజా సంఘాల నాయకులు, దళిత సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ట్రస్టు సభ్యులు వై.అనిల్, ఉన్నవ సల్మాన్, నల్లగండ్ల రవిచంద్ర, కనపర్తి శశి, దండమూడి సతీష్, యండ్రపాటి సునీల్, జూపల్లి వంశీ, కుర్రా యశ్వంత్, దుబాయ్ బాబు, సయ్యద్ గౌస్, పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలిఅర్బన్: చదలవాడ సతీష్ చంద్ర 3వ వర్ధంతిని పురస్కరించుకుని రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి వారి అన్నదాన కేంద్రంలో ఆదివారం పేదలకు అన్నదానం చేశారు. అలాగే బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా గాంధీ శాంతి వృద్ధాశ్రమంలో కూడా అన్నదానం చేశారు. కార్యక్రమంలో చదలవాడ వేణుగోపాలరావు, నయనతార, శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం కన్వీనర్ ముద్దాభక్తుని రమణయ్య, ఉమామహేశ్వరరావు, దామోదర్, ప్రణవ్, ఆద్విక్, పాల్గొన్నారు.

ఫిలదెల్ఫియా సంఘ సభ్యులకు సన్మానం



తెనాలిఅర్బన్: ఏసుక్రీస్తు జన్మించిన ఇజ్రాయేల్ దేశాన్ని సందర్శించడం అదృష్టమని ఫిలదెల్ఫియా సంఘ కాపరి పాస్టర్ చిలువూరి నతానియేల్ పేర్కొన్నారు. మారీసుపేటలోని చర్చి ఆవరణలో ఇజ్రాయేల్ పర్యటన పూర్తి చేసుకుని స్వస్థలానికి వచ్చిన సంఘ సభ్యులు పినపాటి స్టీవెన్‌బాబు, గాజులవర్తి కెథారిన్, బుల్లా మాణిక్యమ్మ, కొండమూది వరప్రసాద్, సుజాత దంపతులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఇజ్రాయేల్ దేశ పర్యటన విశేషాలను వారు వివరించారు.

అవయవ దానం మహత్తర ఆశయం



లక్ష్మీపురం: అవయవ దానం మహత్తర ఆశయమని హెల్త్ ఎవేర్ నెస్ అధ్యక్షుడు, ప్రముఖ యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం అవయవదాన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందుశేఖర్ మాట్లాడుతూ అవయవ దానం చేయడం ద్వారా ఎంతో మందికి ప్రాణదానం చేసి నూతన జీవితాన్ని ప్రసాదించవచ్చని తెలిపారు. చనిపోయిన తర్వాత కూడా మరికొంతమందిలో కొన్నేళ్లపాటు బతికే ఉంటారని చెప్పారు. అవయవదాన ప్రచారకులు పి.భావన్నారాయణ, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ అవయవదానంపై చైతన్య కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరగాలని అభిప్రాయపడ్డారు. ప్రాథమిక స్థాయిలోనూ అవయవ దానం ప్రాధాన్యం, అవసరాన్ని గురించి పిల్లలకు తెలిసేలా పాఠ్యాంశాల్లో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య, ఇంజినీర్ సదాశివం, సంస్థ సీనియర్ సభ్యుడు పి.జనార్దనరావు ప్రసంగించారు.

పేకాట శిబిరంపై దాడి



దాడిలో పట్టుబడ్డ జూదరులు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆత్మకూరులో పేకాటశిబిరంపై మంగళగిరి రూరల్ ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకట్, ప్రొబేషనరీ డీఎస్పీ భార్గవి ఆదివారం దాడి చేసి, ఏడుగురికి అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా మంగళగిరి రూరల్ ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకట్ మాట్లాడుతూ ఆత్మకూరులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చిందని, సిబ్బందితో దాడిచేశామని ఈ దాడిలో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 2,510లు, నాలుగు సెల్‌ఫోన్స్, ఒక మోటార్ సైకిల్‌ను సీజ్ చేసి పేకాడుతున్న వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచామని తెలిపారు. మండల పరిధిలో ఎవరైనా కోడి పందేలు, పేకాట, ఇతర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అటువంటి వారి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన అన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు

సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య



సమావేశంలో మాట్లాడుతున్న చిన్ని తిరుపతయ్య

తాడేపల్లిరూరల్ : డిసెంబర్ 26 నుంచి 2025 డిసెంబర్ 26 వరకు ఒక సంవత్సర కాలం భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పిలుపునిచ్చారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సీపీఐ కార్యాలయంలో తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి చిన్ని తిరుపతయ్య ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవాడి భవిష్యత్తు కమ్యూనిస్టు పార్టీ చేతులో ఉందని, ఏ ప్రజా సమస్య అయినా సీపీఐ ముందుండి పోరాడుతుందని అన్నారు. రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన రూ.15 వేల కోట్లను గ్రాంట్‌గా మార్చాలని, పోలవరం ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సీపీఐ మంగళగిరి నియోజకవర్గం సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య మాట్లాడుతూ డిసెంబర్ నెలకి సీపీఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకోనుందని, తాడేపల్లిలో అనేక ప్రజా సమస్యలపై సీపీఐ పోరాటం చేస్తోందని, ఫారెస్ట్ ప్రాంతాల్లో ఇరిగేషన్ భూములల్లో నివాసాలు ఏర్పరచుకున్న వారు ఇళ్లు ఎప్పుడు పీకివేస్తారో అని భయంభయంగా జీవనం సాగిస్తున్నారని, ఫారెస్ట్, ఇరిగేషన్ భూముల్లో నివాసాలు ఏర్పరచుకున్న వారికి పట్టాలిస్తామని హామీ ఇచ్చిన మంగళగిరి శాసన సభ్యులు నారా లోకేష్ నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మంగళగిరి కార్యదర్శి జాలాది జాన్‌బాబు, తాడేపల్లి సిపిఐ నాయకులు మానికొండ డాంగే, మునగాల రామారావు, దొంత కోటేశ్వరరావు, కర్రి సురేష్, శీలం శ్యామ్ ప్రసాద్, ఎన్. లక్ష్మణ, సీహెచ్ క్రాంతి, సీహెచ్ బోసుబాబు, శీలం అనిల్‌కుమార్, లంకే ప్రశాంత్ రాజు, లంకే ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఆ ఫుట్‌పాత్ ప్రదేశం ఇక ఖాళీ

- ఎంతోకాలంగా అక్కడే ఉంటున్న వ్యక్తి
- మండే ఎండ.. జోరు వర్షం ఏదైనా సరే!
- అనారోగ్యంతో మృతి
- స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో అంత్యక్రియలు



ఓవర్‌బ్రిడ్జి ఫుట్‌పాత్‌పై వ్యక్తి

తెనాలి: ఈ గాలితో.. ఈ వానతో.. ఈ ఎండతో.. ఈ సమాజంతో సంబంధం లేదన్నట్లు.. అతడు ఎక్కడివాడో తెలీదు... చెంచుపేట నుంచి వచ్చేటప్పుడు రైల్ ఓవర్ బ్రిడ్జి ఆరంభంలో ఎడమవైపు రెయిలింగ్‌కు ఆనుకుని ఫుట్‌పాత్‌పైనే నివాసం. కింద ఓ బొంత, రెయిలింగ్ పైనుంచి కొన్ని దుప్పట్లు తనపై కప్పుకుని ఉంటాడు. భారీ వర్షంలో, 45 డిగ్రీల ఎండ వేడిమిలోనూ అక్కడే పడకసీనులో ఓవర్‌బ్రిడ్జి ఎక్కి దిగే ప్రతివారికీ కనిపిస్తాడు. ఎవరైనా ఆహారం పెడితే లేచి కూర్చుని తీసుకుంటాడు. ఆకలి తీరుతుంది...మళ్లీ యథాస్థితిలోకి వెళతాడు. ఏమైందో ఏమో తెలీదు...

ఆదివారం ఉదయం విగతజీవుడై కనిపించాడు. విషయం తెలిసిన స్థానిక హెల్పింగ్ సోల్జర్స్ సంస్థ ప్రతినిధి షేక్ ఇనయతుల్లా స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం వద్ద దుస్తుల్లో ఆధార్ కార్డు లభించింది. అందులోని వివరాల ప్రకారం కొత్తపల్లి జగన్‌మోహనరావు, తురిమెళ్ల అని ఉంది. అంతకుమించి వివరాలేవీ లేవు. అనాథ కావటంతో హెల్పింగ్ సోల్జర్స్ సంస్థ ఆధ్వర్యంలో అతడి మృతదేహాన్ని బుర్రిపాలెం రోడ్డులోని మహాప్రస్థానానికి తరలించారు. అక్కడే అంత్యక్రియలను పూర్తిచేశారు. ఇనయ్‌తుల్లా, ఆయన మిత్ర బృందం రవి, సంజయ్, వేణును స్థానికులు అభినందించారు.

హడలెత్తించిన వీధి కుక్క

- ఆరేపల్లిలో ఐదుగురికి కుక్క కాట్లు
- 85ఏళ్ల వృద్ధుడి కండలు పీకిన వైనం



తెనాలి ప్రభుత్వ ఆస్పత్రిలో చేతికి కట్టుతో బి.సుబ్బారావు

తెనాలి: ఇంటి చావడిలో మంచంపై నిద్రపోతున్న ఓ వృద్ధుడిని ఓ వీధి కుక్క దారుణంగా కరిచింది. తల కింద చెయ్యి పెట్టుకుని నిద్రిస్తుండగా వీధికుక్క దాడిచేసింది. మోచేతి కండ పీకేసింది. స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేశారు. వివరాలు.. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలంలోని ఆరేపల్లి యాదవపాలెంలో బి.సుబ్బారావు అనే 85 ఏళ్ల వృద్ధుడు ఆదివారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో భోజనం చేశాడు. అలవాటు ప్రకారం ఇంటిని ఆనుకుని ఉండే చావడిలోకి వెళ్లి మంచంపై నిద్రకు ఉపక్రమించాడు. కొద్దినిముషాల్లోనే అటువైపు వచ్చిన ఓ వీధికుక్క సుబ్బారావు తలకింద పెట్టుకున్న ఎడమచేతిని నోటికి తీసుకుంది. కసితీరా కండ ఊడేలా కరిచేసింది. ఉలిక్కి పడి లేచిన సుబ్బారావు అరుపులకు బయటకు వచ్చిన కుటుంబ సభ్యులు, కుక్కను తరిమేశారు. అప్పటికే అతడి చేతినుంచి కండ ఊడిపోయి, రక్తమోడుతోంది. దీనితో అతడిని హుటాహుటిన తెనాలిలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడి వైద్యులు ప్రథమ చికిత్స చేసి, అనంతరం కుట్లు వేశారు. ఇన్‌పేషంట్‌గా అడ్మిట్ చేసుకున్నారు. ఆరేపల్లిలో ఆ వీధి కుక్క ఆగడం అంతటితో ఆగలేదు. మరో నలుగురిని కరిచిందట! వారిలో ఇద్దరు ఇదే ఆస్పత్రికి వచ్చి చికిత్స తీసుకున్నారు. ఆగ్రహం చెందిన గ్రామస్తులు ఆ కుక్కను వెంటాడి చంపినట్టు తెలిసింది.

ఎస్‌సీఆర్ ఆటోడ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడిగా సాంబశివరావు



సాంబశివరావుని సత్కరిస్తున్న యూనియన్ సభ్యులు

నగరంపాలెం: దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) ఆటోడ్రైవర్స్ యూనియన్ (ఈస్ట్ సైడ్ రైల్వేస్టేషన్ గుంటూరు-1) అధ్యక్షుడిగా వై.సాంబశివరావు ఎన్నికయ్యారు. గుంటూరు తూర్పు వైపున్న రైల్వేస్టేషన్‌లో ఆదివారం యూనియన్ ఎన్నికలు పోటాపోటీగా జరిగాయి. అధ్యక్ష పదవి కోసం వై.సాంబశివరావు, షేక్ ఖలీల్, బి.సామ్యేల్ పోటీపడ్డారు. అధ్యక్షుడిగా సాంబశివరావు 66 ఓట్లతో గెలవగా, కార్యదర్శిగా ఎస్.వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రయాణికుల్ని క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేర్చుతామని నూతన అధ్యక్షుడు సాంబశివరావు తెలిపారు. అనంతరం సభ్యులు ఆయన్ను సత్కరించారు. యూనియన్ సభ్యులు సెబాస్టిన్, అక్బర్ అలీ, అహ్మద్ బాషా, ఎం.దేవా, డ్రైవర్లు పాల్గొన్నారు.